నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 5 నవంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న మాజీ సర్పంచులు

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలంటూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచులను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా పలువురిని ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో గ్రామాలాభివృద్ధికి సొంత డబ్బులు ఖర్చు చేశామని, ప్రభుత్వం మారడంతో కాంగ్రెస్ సర్కారు పైసలను ఎగ్గొట్టడం సరికాదన్నారు. పనుల రికార్డులు చూసి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్లకు తీసుకెళ్లి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

జోగులాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఇథనాల్ కంపెనీతో కాలుష్యం

- పొలాలు బీళ్లుగా మారడం ఖాయం
- తుంగభద్ర జలాలు సైతం కలుషితమయ్యే ప్రమాదం
- నష్టం తెచ్చే కంపెనీ మాకొద్దు.. • 12 గ్రామాల రైతుల డిమాండ్
- మద్దతు తెలిపిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్‌పీ

గద్వాల, నవంబర్ 4 : 'ఇథనాల్ కంపెనీ కాలుష్య కారకమని.. పచ్చని పొలాలు సైతం బీళ్లుగా మారే ప్రమాదం ఉన్నదని.. తుంగ భద్ర జలాలు, తాగు, సాగునీరు కలుషితమయ్యే ప్రమాదం నెలకొన్నది'.. అంటూ 12 గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం గద్వాల కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన రైతులు ఈ కంపెనీ మాకొద్దంటూ నినదించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రాజోళి మండలం పెద్ద ధన్వాడ శివారులో 29 ఎకరాల పంట పొలాల్లో గాయిత్రీ రెన్యూవబుల్ ఫ్యూయల్స్ ప్రైవేటు లిమిటెడ్ ఇథనాల్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫ్యాక్టరీ ఏర్పాటైతే పెద్దధన్వాడ, చిన్న ధ్వాడ, నస నూల్, మాన్‌దొడ్డి, చిన్నతాండ్రపాడు, వేణిసోంపురం, నౌరో జ్యాంప్, కేశవరం, తుమ్మిళ్ల, పచ్చర్ల, తనగల, పెద్దతాండ్రపాడు, రాజోళి గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని హెచ్చరించారు. కంపెనీ నుంచి వచ్చే కాలుష్యం, వ్యర్థ జలాలతో క్యాన్సర్‌తోపాటు శ్వాస కోశ వ్యాధుల బారిన ప్రజలు పడే అవకాశం ఉన్నదన్నారు. అయితే అక్కడే దళితుల కోసం 152 ఎకరాల భూమిని గతంలో ఇచ్చారని.. 173 సర్వే నెంబర్‌లో చిన్న ధ్వాడ దళితులకు గృహనిర్మాణం కోసం 2009లో నాటి ప్రభుత్వం ఆరెకరాల భూమి కేటాయించినట్లు గుర్తు చేశారు. ప్లాట్లు, పొలాల మధ్య నిర్మించే ఫ్యాక్టరీతో కాలుష్యం వెలువడే అవకాశం ఉందన్నారు. ఇదంతా సమీపంలోని తుంగభద్ర నదిలోకి విడుదల చేస్తే ప్రజలతోపాటు పశు, పక్షాదులు తాగి వన్యప్రాణుల మనుగడకు భారీ ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇలా తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా ఆర్డీఎస్‌కు నీటిని ఎత్తి పోయడంతో సాగు చేసే పంటలు చేతికి రాక పోగా.. అలంపూర్ నియోజకవర్గంలో పచ్చని పంటలు బీళ్లుగా మారే ప్రమాదం ఉన్నదన్నారు. ఏదైనా కంపెనీ ఏర్పాటు చేయాలంటే ముందుగా ప్రజా భిప్రాయ సేకరణ చేయాలని, కానీ ఇక్కడ మాత్రం అభిప్రాయ సేకరణ లేకుండా ఏకపక్షంగా ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణతోపాటు ఏపీలోని పలు గ్రామాలవాసులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నదని, ప్రజలు, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కంపెనీని ఇక్కడ ఏర్పాటు చేయొద్దన్నారు.

రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఎస్‌పీ

బీఆర్ఎస్ నేతల మద్దతు

గద్వాల కలెక్టరేట్ ఎదుట ఇథనాల్ కంపెనీ పెట్టొద్దని రైతులు ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సాట్ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ నాయకులు బైకాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతి యాజ్, విజయ్ కుమార్, పల్లయ్య అక్కడకు చేరుకొని వారికి మద్దతు తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమ రద్దు చేయించేందుకు కృషి చేస్తామని వారు భరోసా ఇచ్చారు. అనంతరం రైతులు కలెక్టర్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు సుధాకర్ గౌడ్, గాలి రెడ్డి, నారాయణగౌడ్, దేవన్న, హన్మంతు, గోవిందయ్య, రామానాయుడు, చిన్నమద్దిలేటి, చిన్న బాబుతోపాటు నాయకులు పాల్గొన్నారు.

- గాంధీభవన్‌లోనే ఎఫ్ఐఆర్‌లు నమోదు
- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నేతలపై కేసులా..?
- శ్రీకాంత్‌గౌడ్‌కు హాని జరిగితే రేవంత్‌దే బాధ్యత
- గులాబీ పాలన మళ్లా రాబోతున్నది..
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్‌ది దుర్మార్గ పాలన

మహబూబ్‌నగర్, నవంబర్ 4 : గాంధీ భవన్‌లో ఎఫ్ఐఆర్‌లు తయారవుతున్నాయని.. నేను పోలీసు శాఖలో పనిచేసినందుకు సిగ్గుతో తల దించుకుంటున్నా.. అంటూ బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పోలీసుశాఖ ఇంత ఘోరమైన స్థాయికి దిగజారడం బాధగా ఉన్నదన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ నేత శ్రీకాంత్‌గౌడ్ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో ఆర్ఎస్‌పీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలనలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబం, శ్రీకాంత్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిదర్శనం జైలులో ఉన్న శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. 2018లో ముగ్గురు దుర్మార్గులు దొంగ పట్టాలు సృష్టించి పేదలను మోసం చేశారని అప్పటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కేసు పెట్టించారన్నారు. ఆ కేసును 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం కాపీ.. పేస్ట్ చేసి కొత్త కేసు పెట్టి ఆ ముగ్గురితోపాటు ఏ-4గా శ్రీకాంత్‌గౌడ్‌ను అన్యాయంగా కలిపారని ధ్వజమెత్తారు. పోలీసులు ఎలా కేసులు పెడుతుంద్రో చూడాల్సిన బాధ్యత హోం శాఖ మంత్రిదే..కానీ ఆ శాఖ సీఎం వద్దనే ఉందన్నారు. ప్రజల కోసం పనిచేసే సిఐ బీసీ నేతపై రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కూడబలుక్కొని కేసు నమోదు చేయించి జైలుకి పంపించారని ఆరోపించారు. శ్రీకాంత్‌గౌడ్‌కు ఏమైనా హాని జరిగితే స్థానిక ఎమ్మెల్యే తోపాటు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వరద భాస్కర్ బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ప్రశ్నించే పోస్టులు పెట్టినందుకు తెల్లవారు జామున అతడి ఇంటి నుంచి తీసుకొచ్చి పోలీస్ స్టేషన్‌లో కొట్టడం సరికాదన్నారు. ఎందుకు కొట్టారని అడిగిన మాజీ మంత్రితోపాటు బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేయడమేమిటన్నారు. పిస్తా హౌస్‌లో పనిచేసే వ్యక్తి చిన్నారిపై లైంగిక దాడికి యత్నిస్తే పోలీసులు పట్టించుకోలేదని, దీంతో శ్రీనివాస్‌గౌడ్ పోలీస్ అధికారులతో మాట్లాడితే అప్పటికప్పుడు కేసు నమోదు చేశారన్నారు. బీఆర్ఎస్ కేసీఆర్ కుటుంబం.. కేటీఆర్, హరీశ్‌రావు నాయకత్వంలో నడుస్తున్న పార్టీ అన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో గులాబీ పార్టీ పాలన రాబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన ఏ అధికారైనా చట్టం ముందు దోషిగా నిలబడాల్సిందేనని గుర్తు చేశారు. అంతకుముందు చిన్నారి తల్లిదండ్రులను ఆర్ఎస్‌పీ కలిసి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతి యాజ్‌ఇసాక్, సాట్ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్, శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మాజీ ఎంపీపీ బాలరాజు, వరద భాస్కర్, జంబులయ్య ఉన్నారు.



రాజేశ్వరి కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడుతున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఆర్ఎస్‌పీ

రాజేశ్వరి మృతికి కారకులను ఉరితీయాలి

- మల్దకల్ ఎస్సైపై కేసు నమోదు చేయాలి
- బంధుప్రీతి చూపిస్తున్న ఎమ్మెల్యే బండ్ల
- ఘటనపై డీజీపీకి ఫిర్యాదు చేస్తాం
- కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల తోనే పరామర్శ
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్‌పీ

మల్దకల్, నవంబర్ 4 : మండలంలోని బిజ్వారంలో ఆత్మహత్యకు పాల్పడిన మైనర్ బాలిక మృతికి కారకులను ఉరి తీయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గులాబీ బాస్ కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాజేశ్వరి కుటుంబ సభ్యులను సోమవారం వారు పరామర్శించారు. అంతకుముందు మృతురాలి ఇంటి వరకు వారు ర్యాలీగా వచ్చి మృతురాలి తల్లి కవిత, పెద్దమ్మ వెంకటేశ్వరితో జరిగిన ఘటనపై విచారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలిక మృతి చెంది 20 రోజులు గడిచినా నిందితుడు రాజశేఖర్‌రెడ్డిని పట్టుకోవడంలో పోలీసుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో 1.50 లక్షల మంది పోలీసులు ఉన్నా.. నిందితుడిని అరెస్టు చేయడం లేదన్నారు. ఘటనతో రాజశేఖర్‌రెడ్డికి ఎంత సంబంధం ఉందో.. ఎస్సైకి కూడా అంతే ఉందన్నారు. కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఇంకా పట్టుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 10 బృందాలు వెళ్లాయని అంటున్నారే.. తప్పా ఆచరణలో ఎలాంటి మార్పు లేదన్నారు. రెండు తులాల బంగారం చోరీ ఒక చోటజరిగితే.. విచారణ మల్దకల్ పోలీస్‌స్టేషన్‌లో చేయడం ఏమిటని ప్రశ్నించారు. బాలికను పనిలో పెట్టు కోవడమే నేరమని.. అలాంటిది ఆమెపై నింద మోపడం ఏమిటన్నారు. బంగారం దొరికిందని యజమాని ఒప్పుకొని.. మళ్లీ చోరీ కేసు పెట్టి వేధించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మల్దకల్ ఎస్సై ఇందులో అత్యుత్సాహం ప్రదర్శించారని ఆరోపించారు. బీఆర్ఎస్‌తోపాటు అన్ని పార్టీల నాయకులు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 15 రోజులుగా ఆందోళనలు చేయడం తోనే నిందితుడిపై 107 సెక్షన్ కేసు నమోదు చేశారన్నారు.

ఎమ్మెల్యే బంధుప్రీతి చూయిస్తున్నారా?

నియోజకవర్గంలో ఇంత దారుణ ఘటన జరిగినా ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పట్టించుకోకపోవడం చూస్తే బంధుప్రీతి చూపిస్తున్నారని అర్థమవుతుందని శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికి అన్యాయం జరిగితేనే పట్టించుకోవ లేదంటే.. మనం ఓట్లు వేయలే దా? అని ప్రశ్నించారు. రాశేఖర్‌రెడ్డి వారి బంధువర్గం కావడం తోనే ఈ ఘటనను పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటి ఘటన మరోసారి పునరావృతం కాకుండా డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. అప్పటికీ న్యాయం జరగకపోతే ఇంకా ముందుకెళ్లి పోరాటం చేస్తామని హెచ్చరించారు. నిందితుడిని ఉరి తీసేవరకు పోరాడుతాం.. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సాట్ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ నాయకులు బైకాని శ్రీనివాసయాదవ్, అభిలాష్‌రావు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కుర్వ విజయ్‌కుమార్, కుర్వ పల్లయ్య, ఇంతి యాజ్, నడ్డిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రంజిత్‌కుమార్, తిరుమల్ నాయుడు, కామేశ్, గంగాధర్, రాజు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి : ఎమ్మెల్యే విజయుడు

మానవపాడు, నవంబర్ 4 : పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సూచించారు. సోమవారం ఉండవెల్లి మండలంలోని వరసిద్ధి వినాయక జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన పత్తి ఉత్పత్తికి తెలంగాణలోని అలంపూర్ నియోజకవర్గం ఎంతో ప్రసిద్ధి చెందిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు రూ.7,521 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు చెప్పారు. దళారులను సంప్రదించకుండా నేరుగా కేంద్రాల్లోనేవిక్రయించాలని, ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

యువకుడికి రిమాండ్

- చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన రిజ్వాన్‌పై పోక్సో కేసు

మహబూబ్‌నగర్, నవంబర్ 4 : మహబూబ్‌నగర్ పార్కులో ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. చిన్నారిపై అఘాయిత్యానికి యత్నించడమే కాకుండా గొంతు నులిమేందుకు యత్నించిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన రిజ్వాన్ ఆలమ్ (20)ను విచారించి సోమవారం కోర్టులో హాజరుపర్చగా.. జిల్లా జైలుకు రిమాండ్ ఖైదీగా తరలించినట్లు చెప్పారు.

అందాల తార అనసూయ సందడి

- వనపర్తిలో కాసం ఫ్యాషన్స్ షోరూం ప్రారంభించిన నటి

వనపర్తి, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలో కాసం ఫ్యాషన్స్ 15వ షోరూంను సినీనటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా అందాల తార అనసూయను చూసేందుకు అభిమానులు పరిసర ప్రాంతవాసులు, యువతీయువకులు బారులు దీరారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పుల్లూరు అరుణ్‌కుమార్, వరుణ్, మున్సిపల్ చైర్మన్ మహేశ్, వైస్ చైర్మన్ కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ అధునాతన కలెక్షన్స్‌తో నిత్య నూతన వెరైటీలతో కాసం ఫ్యాషన్స్ పేరుగాంచిందన్నారు. ఈ స్టోర్‌ను వనపర్తిలో తాను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మాల్‌లోని లేడీస్, జెంట్స్, కిడ్స్‌వేర్‌ను కలియతిరిగి సందడి చేశారు. వనపర్తి చుట్టుపక్కల వారంతా దుస్తులు కొనుగోలు చేయాలన్నారు. షాపింగ్‌మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో 4 ఏండ్లుగా ప్రజల మన్ననలు పొందుతూ వనపర్తిలో 15వ స్టోర్‌ను ప్రారంభించుకున్నామన్నారు. కార్యక్రమంలో కాసం ఫణీ, కాసం సాయికృష్ణ, కాసం ధీరజ్, డాక్టర్ కాసం ప్రీతం, యాంసాని ప్రవీణ్ పాల్గొన్నారు.

నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి షోరూంను ప్రారంభిస్తున్న సినీనటి అనసూయ భరద్వాజ్

స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

మహబూబ్‌నగర్ విద్యా విభాగం, నవంబర్ 4 : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్లు స్కాలర్‌షిప్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎంవీఎస్ కళాశాల ఎదుట రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చేతగాని ప్రభుత్వం గద్దెదిగాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నినాదాలు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

గన్నీబ్యాగులు నామమాత్రం

మాగనూరు, నవంబర్ 4 : రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతున్నా.. ఆచరణ మాత్రం అందుకు విరుద్ధమని రైతులు ఆరోపిస్తున్నారు. సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన గన్నీ బ్యాగులేవీ కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి నామమాత్రంగా కేవలం 12వేల గన్నీ బ్యాగులు మాత్రమే పంపించినట్లు సీవో గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. అవికూడా కృష్ణా మండలంలోని గుడెబల్లూర్ సెక్టార్‌కు మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు. నేరడగం, మాగనూర్, అడవిపత్తారం, చేగుంట ఉమ్మడి మండల వ్యాప్తంగా దాదాపు 7నుంచి 8లక్షల వరకు గన్నీ బ్యాగులు రావాల్సి ఉందని.. ధాన్యం కొనుగోలు చేస్తే ఏ మిల్లుకు పంపించాలో కూడా చెప్పలేదని.. గన్నీ బ్యాగులు ఇంకా రావాల్సి ఉందని.. అవి వచ్చిన వెంటనే రైతులకు పంచుతామని తెలిపారు.

నమస్తే ఎఫెక్ట్

సమయపాలన పట్టదా?

- కోడేరు పీహెచ్‌సీలో ఇష్టాను సారంగా విధులు

కోడేరు, నవంబర్ 4 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల వరకు డాక్టర్ విధులకు రాకపోవడంతో రోగులు ఎదురు చూస్తూ దవాఖానలో కూర్చున్నారు. ఉదయం 10:30 గంటలకు యూనానీ డాక్టర్ తయాబ్, ల్యాబ్ టెక్నీషియన్ నారాయణ, ఫార్మాసిస్టు, ఇద్దరు ఏఎన్‌ఎంలు మాత్రమే విధుల్లో ఉన్నారు. ఇద్దరు స్టాఫ్‌నర్స్‌లు ఉన్నప్పటికీ రోగులకు బ్యాండేజ్ కూడా వేయలేదని.. తప్పనిసరి పరిస్థితుల్లో తామే బ్యాండేజ్ కట్టుకున్నామని కోడేరుకు చెందిన బొక్కలయ్య, మోడల్ పాఠశాల విద్యార్థి వాపోయారు. మధ్యాహ్నం 12 తర్వాత డాక్టర్ దశరథం విధులకు రాగా.. మీ కోసం ఎదురు చూస్తున్నామని, టైంకు రాకుంటే ఎలా అని రోగులు ప్రశ్నించారు. తనది లింగాల మండలం అంబటిపల్లి పీహెచ్‌సీలో పోస్టింగ్ అని.. అధికారులు అక్కడికి పంపకపోవడంతో ఇక్కడికే వస్తున్నానని సమాధానమిచ్చాడు. దవాఖానలో ప్రథమ చికిత్స చేసే నాథుడే లేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. కంపౌండర్ లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొన్నదని అంటున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గాయాలకు కట్లు కట్టుకుంటున్న రోగులు